# అన్నిటిలో అతి శ్రేష్ఠమైన ఈవి

డేవిడ్ రోపర్

మనలో అనేకులు ఈవులను పొందగోరతారు. ఇలా బహుమానాలను పొందడం వేడుకగా ఉంటుంది. బహుమానాలు యివ్వడం అంతకంటెను వేడుకగానే ఉంటుంది. "పుచ్చుకొనుటకంటె ఇచ్చుట ధన్యము" అని ప్రభువైన యేసు తెలిపాడు (అపొ. 20:35). మనమందరం ఈ పాఠం నేర్చుకోవాలి, దానిని మనం మన పిల్లలకు ఉపదేశించాలి.

ఇటీవల కాలంలో నేను యిచ్చే బహుమానాల విషయంలో ఒక సంగతి నన్ను ఆకట్టుకొన్నది. కొండమీద ప్రసంగంలో ప్రభువైన యేసు యిలా అన్నాడు: "మీరు మిమ్మును ప్రేమించువారినే ప్రేమించినయెడల మీకేమి ఫలము కలుగును? సుంకరులును ఆలాగు చేయుచున్నారు గదా? మీ సహోదరులకు మాత్రము వందనము చేసినయెడల మీరు ఎక్కువ చేయుచున్నదేమి? …" (మత్తయి 5:46, 47). "నీ సొంత పరిధిలోనే ఒకరికొకరు వందనములు చేసికొనినయెడల" అన్నట్టు ఫిలిప్స్ తర్జుమా 47వ వచనంలో ఉంది. ప్రకటన గ్రంథమందు, దేవుని యిద్దరు ప్రవక్తలు పడిపోయినప్పుడు, "భూనివాసులు … ఉత్సహించుచు, **ఒకనికొకడు కట్నములు పంపుకొందురు**" (ప్రకటన 11:10; ఒత్తి పలకడం నాది). "బహుమానాలు యివ్వడంలో" ఎక్కువ భాగం యిచ్చి పుచ్చుకొనడానికి సంబంధించినదై యుంటుంది. నా పిల్లలను నేను తిరిగి పెంచగలిగినట్టయితే, మాకు తిరిగి యివ్వలేనివారికి బహుమానాలు యివ్వడం పైన ఎక్కువ నొక్కి చెప్పడం జరుగుతుంది.

బహుమానాలను యివ్వడాన్ని గూర్చి బైబిలు అధికంగా తెలియజేస్తుంది: తన ఉప పత్నుల పిల్లలకు "అబ్రాహాము బహుమానములిచ్చి"నట్లు చెప్పబడింది (ఆది. 25:6). జ్ఞానులు యేసును కనుగొనినప్పుడు, "బంగారమును సాంబ్రాణిని బోళమును కానుకలుగా ఆయనకు సమర్పించిరి" (మత్తయి 2:11). తల్లిదండ్రులు తమ పిల్లలకు "మంచి ఈవుల నియ్య" ఎరుగుదురు (మత్తయి 7:11). ఈ పాఠంలో "అన్నిటిలో అతి శ్రేష్ఠమైన ఈవిని" గూర్చి మాట్లాడుకుందాం.

## అతి శ్రేష్ఠమైన యీవిని గుర్తించడం

అన్నిటిలో అతిశ్రేష్ఠమైన ఈవి ఏదనుకుంటావ్? బాలురైతే ఆట వస్తువులను తలంచవచ్చు. ఆడపిల్లలైతే బొమ్మలను కోరుకోవచ్చు. తల్లులైతే ఇల్లును శుద్ధీకరించే వాటిని కోరుకోవచ్చు. తండ్రులైతే అందరికి అవసరమైన బహుమానాలను చెల్లింపగల డబ్బును కోరుకోవచ్చు.

కాలక్రమంలో బహు రమ్యమైన బహుమానాలు యివ్వబడ్డాయి. ప్రాచీన ప్రపంచం యొక్క ఏడు వింతలలో ఒకటైయుండిన – బబులోను యొక్క వ్రేలాడు తోటలను నెబుకద్నెజరు నిర్మించి – తన గత భవనంలో ఒంటరిగానున్న తన భార్యకు బహుకరించాడట. 880 రత్నాలతో అలంకరింపబడిన ఒక కిరీటాన్ని నెపోలియన్ తన భార్యయైన జోసిఫన్‌కు బహుమానంగా యిచ్చాడట. హోటల్ వ్యాపారంలో అగ్రగణ్యుడగు జార్జి బాల్ట్ సెయింట్ లారెన్స్ నదిలోని వెయ్యి ద్వీపాల్లో ఒక దానిని కొని, తన భార్యకు బహుమానంగా ఉండేలా హృదయాకారంలోనికి దాన్ని మల్చించాడట![1]

నీవు పొందిన బహుమానాలలో అతి శ్రేష్ఠమైనదేది? ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం నాకు కష్టమే; అయితే అదే నేను అడిగినప్పుడు ఒక దృశ్యం నా మనస్సులోనికి వస్తుంది. నాకు పది, నా తమ్ముడు కాయ్‌కి ఏడేండ్లు ఉంటాయి. మాకు పెద్ద బండి కావాలని మేమనుకొంటున్నాం. డబ్బు లేదని మా తల్లి దండ్రులు మాట్లాడుకొంటున్నారు; "కష్టంగా ఉందట" పెద్ద బండి వస్తుందనే ఉత్సాహంతో ఉన్నాం; వాని లేత హృదయాన్ని బాధపెట్ట దానికి నేను యిష్టపడలేదు. నాకు వింత గొలిపేలా, మేము పెద్ద బండిని పొందాం! అది బహు వింతైన బహుమానమైయుంది.

నా భార్యకు నాకు యివ్వబడిన బహుమానాలు మా యింటినిండా నిండి ఉంటాయి. వాటిని చూచినప్పుడెల్లా మమ్మును ప్రేమించిన ప్రజల జ్ఞాపకాలతో మా హృదయం పొర్లి పారుతుంది. ఒక సంవత్సరం నా జన్మ దినం కానుకగా నా కుమార్తె నాకు 30 అంగుళాల బెల్టు యిచ్చినందున – 30 అంగుళాల నడుము నాకు ఎన్నడూ లేకపోయినా, నేను దాన్ని భద్రంగా ఉంచాను.

ప్రజలు నాకు ఏదో ఒక విధంగా తమ్మును తాము యిచ్చుకున్నవే నాకు అతి శ్రేష్ఠమైన ఈవులైయున్నాయనుకో. "నా కుమారునికి వారంలో ప్రతిరోజు ఒక గంట, నా ఆదివారంలో రెండు గంటలు నీవు కోరినట్టు నేను గడుపుతాను" ప్రేమతో, తండ్రి అని ఒక తండ్రి తెల్ల కాగితం మీద వ్రాసి తన కుమారునికి యిచ్చాడు.

మనమును, యితరులును పొందిన అద్భుతమైన అనేక బహుమానాలను గూర్చి మనం ఆలోచింపవచ్చును. అయితే అత్యున్నతమైన ఈవి దేవునినుండి వచ్చిందని నేను చెప్ప కోరతాను. ఇది మనలను ఆశ్చర్యపరచనవసరం లేదు. ఎందుకంటె, "శ్రేష్ఠమైన ప్రతి యీవియు సంపూర్ణమైన ప్రతి వరమును, పరసంబంధమైనదై, జ్యోతిర్మయుడగు తండ్రియొద్దనుండి వచ్చును" అని యాకోబు తెలిపాడు (యాకోబు 1:17).

దేవుడు మనకు ఎన్నో ఈవులనిస్తున్నాడు. "ఆయన అందరికిని జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు" (అపొ. 17:25). ఇందులో ఆయన దయచేసే ఆత్మ సంబంధమైన దీవెనలు చేర్చబడియుండవచ్చు: "ఆయన దైవశక్తి, జీవమునకును భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేయుచున్నందున ..." (2 పేతురు 1:3; KJV). ఏదియెలాగున్నా, నా మనస్సులో ఒకే ఒక ప్రత్యేకమైన – దేవుడు ప్రసాదించిన – బహు ప్రత్యేకమైన ఈవి ఉంది.

నేను ఏ లేఖన భాగానికి జరుగుతున్నానో నీకు గ్రహింపు అయ్యే ఉంటుంది – యోహాను 3:16: "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన **అద్వితీయ**

**కుమారునిగా పుట్టిన వానియందు** విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను **అనుగ్రహించెను**" (ఒత్తి పలకడం నాది). దేవుడు లోకమంతటిని ప్రేమించాడు. ఎంతటి బహుమానపు పట్టిక!

## అతి శ్రేష్ఠమైన ఈవిని అభినందించడం

### అతి శ్రేష్ఠమైన ఈవిలో మొదటి భాగం

"అన్నిటిలో అతి శ్రేష్ఠమైన ఈవికి" రెండు భాగాలున్నాయి. వాటిలో మొదటి భాగం యేసే. దేవుడు "తన అద్వితీయ కుమారుని అనుగ్రహించాడు." ఒక చిన్న బాలుని రూపంలో ఈ యీవి లోకానికి అవతరించింది. గొర్రెల కాపరులకు దేవదూత యిచ్చిన వర్తమానాన్ని జ్ఞాపకం ఉంచుకో: "–భయపడకుడి; ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను; దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు" (లూకా 2:10, 11).

ఈ జన్మ యొక్క ప్రాధాన్యత యోహాను 1:1, 14ల్లో కన్పిస్తుంది: "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను." మరియు "ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను." దేవుని కుమారుడు శరీరాన్ని ధరించుకొనడాన్ని నరావతారం అంటారు. నరావతారం లేకుండ సిలువవేయబడడం అనేదానికి అర్థం ఉండదు. కన్య గర్భమందు జన్మ లేకుండ నరావతారం జరిగేది కాదు (మత్తయి 1:23). కన్య గర్భంలో జన్మించలేదంటూ, క్రీస్తు జననాన్ని ఉత్సవంగా చేసేవారి స్థితి ఎంత విషాదకరమైనదో!

ఏదియెలాగున్నా, ప్రభువైన యేసు యొక్క జన్మ బహుమానాల పెట్టెలోనికి తొలి చూపు మాత్రమే. ఆయన కేవలం ఒక పేద దీన స్థితిలోని యింట జన్మించి, జీవితపు నిత్యావసరతలతోనే పెరిగాడు. "మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా? ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యమువలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను" (2 కొరింథీ. 8:9).

ఆ బహుమానం యొక్క సంపూర్ణ ప్రత్యక్షతకు యిదంతయు నడిపిస్తుంది. ఫిలిప్పీ. 2:6–8 ఈ బహుమానాన్ని కొద్దిగా బయలుపరచాడు:

> ఆయన దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను. మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్ను తాను తగ్గించుకొనెను.

క్రీస్తు యొక్క ప్రాణార్పణ (బలి) బహుమానమైయున్నట్టు లేఖనాలు మాటి మాటికి

నొక్కి చెప్తుతున్నాయి: మత్తయి 20:28 "మనుష్యకుమారుడు పరిచారము చేయించు కొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయ ధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెను ..." ప్రభువైన యేసు ప్రభురాత్రి భోజనాన్ని ఏర్పాటు చేసేటప్పుడు, ఆయన పులియని రొట్టె పట్టుకొని – "... **ఇది మీ కొరకు ఇయ్యబడుచున్న నా శరీరము**; నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడని చెప్పెను" (లూకా 22:19బి; ఒత్తి పలకడం నాది). గలతీ. 1:3, 4లో "మనకొరకు తన్ను తాను అప్పగించుకొన్న ప్రభువైన యేసుక్రీస్తును" గూర్చి వ్రాశాడు. గలతీ. 2:20లో "నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారుని ..." అని పౌలు చెప్పుకున్నాడు.

ఈ అంశం మీద పౌలు యొక్క కలం విరివిగా నడుస్తుంది:

> "క్రీస్తు మిమ్మును ప్రేమించి, పరిమళ వాసనగా ఉండుటకు మనకొరకు తన్ను తాను దేవునికి అర్పణముగాను బలిగాను అప్పగించుకొనెను" (ఎఫెసీ. 5:2).
> "... దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ... ఈయన అందరికొరకు విమోచన క్రయధనముగా తన్ను తానే సమర్పించుకొనెను" (1 తిమోతి 2:5, 6).
>
> "యేసుక్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు ఎదురుచూచుచు, ... తన సొత్తుగా చేసికొనుటకు తన్ను తానే మనకొరకు అర్పించుకొనెను" (తీతు 2:13, 14).

ఆ ఈవిని సంపూర్ణంగా అభినందించడం చాలా కష్టం. సిలువ వేయడం అనేది "బహు క్రూరమైనదియు, బహు ఘోరమైన చిత్రహింసయై" ఉన్నట్టు సిసెరో పిలిచాడు. క్లౌస్‌నెర్ యిలా చెప్పాడు: "తన సాటి మానవుని మీద పగతీర్చుకొనడానికి నరుడు రూపించిన బహు క్రూరమును కఠోరమైన మరణం సిలువ"[2] యెషయా 53:5 సిలువ మరణాన్ని గూర్చిన కొన్ని వివరాలను యిలా యిస్తుంది: "మన యతిక్రమక్రియలను బట్టి అతడు గాయపరచబడెను, మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను; మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను, అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది." "గాయపరచబడెను," "నలుగగొట్టబడెను," "శిక్ష," "దెబ్బలు" – అనే మాటలను నీ మనస్సులో ఉంచుకో. అయిదు ప్రాథమిక గాయాలు ఉంటాయని వైద్య విజ్ఞానం చెప్తుతోంది.[3] వాటన్నిటిని యేసు మనకొరకు అనుభవించాడు:

(1) **నలుగ గొట్టిన గాయం**, మొండి సాధనంచే కొట్టబడడంవలన ఏర్పడింది – మీకా 5:1లో ప్రవచింపబడినట్టు ప్రభువైన యేసును కర్రతో తలపై కొట్టారు.

(2) **చీల్చబడిన గాయం**, చీల్చు ఆయుధంతో చేయబడింది. నైపుణ్యంగా కొట్టగల క్రూరుని చేతనున్న కొరడా వర్ణనాతీతమైన బాధను పుట్టిస్తుంది.

(3) **చొచ్చుకొనిపోయే గాయం**, గ్రుచ్చుకొనిపోయే పదునైన ఆయుధంతో చేయబడింది. తలపై యేసు ముండ్ల కిరీటంలోని మేకులు రమారమి నాల్గు అంగుళాల పొడవు ఉంటాయి. సైనికులు ఆ కిరీటాన్ని ఆయన తలమీద ఉంచి దానిపై రెల్లుతో కొడుతూ ఉంటే (మత్తయి 27:29, 30), లోపలికి జొరబడే మేకుల కిరీటపు వలయం యింకా ఎందుకో.

(4) **రంధ్రము చేయు గాయం**, పొడిచిన సాధనములచేత చేయబడింది. ఎముకల మధ్యగుండా పొడిచిన మేకుల ద్వారా భరింప శక్యం కాని బాధ కలిగియుంటుంది. అవి ఎముకలను వేరు చేశాయిగాని, ఎముకలను విరువలేదు. "వారు నా చేతులను నా పాదములను పొడిచియున్నారు" (కీర్తన. 22:16).

(5) **కోయబడిన గాయం**, పదునైన మొనగల సాధనంతో చేయబడింది. "సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కను పొడిచెను, వెంటనే రక్తమును నీళ్లును కారెను" (యోహాను 19:34).

దీనితోపాటు ప్రభువు అనుభవించిన ఆత్మ సంబంధమైన వేదనను చేర్చినట్టయితే, అది ఎన్నడూ యివ్వబడనంత అమూల్యమైన బహుమానమైయుంటుంది. వినువింతగా, ఇదంతా స్వయంగానే యివ్వబడింది: "... నేను దాని మరల తీసికొనునట్లు నా ప్రాణము పెట్టుచున్నాను; ... ఎవడును నా ప్రాణము తీసికొనడు; నా అంతట నేనే దాని పెట్టుచున్నాను ..." (యోహాను 10:17, 18ఎ).

దేవుని ఈవిలో ఉన్న రెండు భాగాలలో మొదటి భాగం – ప్రభువైన యేసే – మనకొరకు సిలువలో మరణించడం. "చెప్ప శక్యము కాని ఆయన వరమును గూర్చి దేవునికి స్తోత్రము" (2 కొరింథీ. 9:15).

## అతి శ్రేష్ఠమైన ఈవిలోని రెండో భాగం

దేవుని బహుమానంలోని రెండవ భాగం ప్రభువైన యేసు యొక్క బలివలన కలిగిన ఫలితం: సిలువ ద్వారా వచ్చే రక్షణ! "మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు; ఇది మీవలన కలిగినది కాదు, **దేవుని వరమే**" (ఎఫెసీ. 2:8; ఒత్తి పలకడం నాది). "ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము, అయితే **దేవుని కృపావరము** మన ప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము" (రోమా 6:23; ఒత్తి పలకడం నాది).

నిరంతరం రక్షింపబడే అవకాశాన్ని గూర్చి ఒకరు మాట్లాడినప్పుడు, మన ప్రతిచర్య ఏమైయుంటుంది? మనం ఉత్సాహభరితులమౌతామా లేక మన ఆవలింతను అణచు కుంటున్నామా? "నేను దాన్ని గూర్చి వందసార్లు విన్నా, అది పాత వార్త" అని జవాబిచ్చే వారిని నేను ఊహించగలను. అది నీ విషయంలో సత్యం కాకపోవచ్చు. రక్షణ అంటే నిజంగా ఎంత పులకరింపుగా ఉంటుందో నీవు ఎరుగుదువని నేను అనుకొంటున్నా. దీన్ని గ్రహించిన మార్కు అనే ఒక బాలుని గూర్చి జో బార్నెట్ యిలా తెలిపాడు:

> మార్కు (సెలవు దినాలను గూర్చి) ఆలోచించినప్పుడు పదమూడు సంవత్సరాల క్రిందటి సంగతిని జ్ఞాపకం చేసికొంటాడు, అప్పుడు అతడు నాల్గేండ్లవాడు.
> అది అతని తల్లిదండ్రులు సారాయిని కనుగొనక ముందు సంగతి:
> ... పెద్దగా జగడమాడుకొనడం, దీర్ఘంగా విడిపోవడం నిరుద్యోగానికి ముందు. ... విడాకులకు ముందు మార్కు తండ్రితో 2000 మైళ్ల దూరమయ్యాడు. మరియు కారు యాక్సిడెంట్ అతడు తన తల్లినుండి శాశ్వతంగా దూరం కాకముందు;
> దిద్దుబాటు పాఠశాలలో (సెలవు దినాలు) గడపడం ఎలా ఉంటుందో అతడు ఎరుగక ముందు;

... తాను జీవించిన వికారమైన లోకానికిని తనకును మధ్య దూరం కలిగించక ముందు ... తన అరెస్టుకు ముందు. ...

గత సంవత్సరం మార్కు విడిపింపబడి శ్రద్ధతో పెంచి పోషించే యింట చేర్చబడ్డాడు. నిరాశనుండి అతడు వెలుపలికి ప్రాకడానికి అది అతనికి తొలి చిన్న మెట్టుగా ఉంది. తనను పెంచుకొంటున్న తల్లిదండ్రులు క్రైస్తవులు. నిజంగా ప్రేమించడం అంటే ఏమిటో, నిజంగా శ్రద్ధ తీసికొనడం ఎలా ఉంటుందో మార్కు తిరిగి కనుగొననారంభించాడు.

వెనుక ముందు ఆడుతూ ఆరాధనకు అతడు తన నూతన తల్లిదండ్రులతో వెళ్లాడు.

తన వయస్సులో ఉన్న యితరులను అతడు కలిసికొన్నాడు. వారు అతనిని అంగీకరించారు, చేర్చుకున్నారు, అతనితో కలిసి పంచుకున్నారు. అతనికి నేర్పించారు.

కడకు, తన గతమంతా శాశ్వతంగా తుడిచివేయబడుతుందని అతడు ఒప్పింపబడ్డాడు, అతడు తన జీవితాన్ని యేసుకు సమర్పించుకున్నాడు. అది ఆరు నెలల క్రితం. గతం యింకా వేదనకరంగానే ఉంది, అయితే మార్పు మాత్రం నమ్మశక్యంగా ఉంది. ...

ఈ (సెలవు దినం) సంతోషంగా ఉంటుంది. అతన్ని పెంచుకొంటున్న తల్లిదండ్రులు అతని విషయంలో ఆనందిస్తున్నారు. దీర్ఘకాలంగా అతడు పోగొట్టుకున్న ప్రేమను శ్రద్ధను వారు యివ్వడానికి ప్రయత్నిస్తున్నారు.

తన (సెలవు దినాలకు) అతనికి యింకా వేరే ఏర్పాట్లు కూడా ఉన్నాయి. వారు అతన్ని పోనిస్తే అతడు తిరిగి దిద్దుబాటు పాఠశాలకు పోతాడు. "బురదలోనుండి పైకి ఎక్కి యేసుతో నడవడం అంటే ఎలాగుటుందో నేను ఆ పిల్లలకు చెప్తూతా. ఆ ఒంటరిగా ఉన్నవారికి నేను ముందుగా ఉండగోరతా, నిరాకరింపబడిన పిల్లలకు నేను ఎరిగిన ప్రాముఖ్యమైన మాటలను వారికి చెప్తూతా: 'దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను'" (యోహాను 3:16).[4]

ప్రభువైన యేసును, ఆయన యిచ్చు రక్షణయు "అతి శ్రేష్ఠమైన ఈవియని" నేను నమ్ముతాను. నీవు కూడా అలాగే నమ్ముతావని నిరీక్షిస్తున్నాను. ఈ సంవత్సరం నీకు బహుమానాలు రాకపోవచ్చు. కాని దేవుడనుగ్రహించిన ఈవితో ఏదియు సాటికాదు.

## అతి శ్రేష్ఠమైన ఈవిని అంగీకరించుట

దేవుని ఈవిని అంగీకరించే విషయంలో నేను కొన్ని మాటలు చెప్పవలసియుంది: "కాగా మేమాయనతోడి పనివారమై మీరు పొందిన **దేవుని కృపను వ్యర్థము చేసికొనవద్దని** మిమ్మును వేడుకొనుచున్నాము" (2 కొరింథీ. 6:1; నొక్కి పలకడం నాది). దేవుని కృపగల ఈవిని "పొందడం" అవసరమని ఈ వచనం స్థిరపరచుతుంది. అది మరో విషయం కూడా సూచిస్తుంది, నీవు దాన్ని పోగొట్టుకొనవచ్చు. దేవుని వరము విషయంలో వ్యక్తిగతమైన బాధ్యతను యిది నొక్కి చెప్తుతుంది.

ప్రతి ఒక్కరు వ్యక్తిగతమైన బాధ్యత అనే భావన అర్థం చేసికొనరు. రక్షణ వరమై నందున, మన ప్రయాసను అది తొలిగించుతుందని కొందరు తలంచుతారు. నేనుగాని నీవుగాని దేవుని వరమును సంపాదించుకోలేమని నేను త్వరగా అంగీకరిస్తాను – అయినా మనం దాన్ని అంగీకరించాలి. అది దేవుని ఆజ్ఞకు మన విధేయతను కోరుతుంది.

"ట్రూత్ ఇన్ లవ్" అనే టెలివిజన్ ప్రోగ్రామును నేను నడిపిస్తున్నప్పుడు, నా

తమ్ముడు కాయ్ ప్రోగ్రాములో కనబడి దేవుని కృపమీద మాట్లాడాడు. అతడు పాఠాన్ని వర్ణింప జేసేటప్పుడు, మా అమ్మ తనకు యిచ్చిన చొక్కాను గూర్చి చెప్పాడు. ఆ బహుమానాన్ని పుచ్చుకొనడంలో తాను చేయవలసిన విషయాలను అతడు వర్ణించాడు. మొట్ట మొదట అతడు దాన్ని ఊడదీయాలి. ఆ షర్టుకు ఉన్న గుండు సూదులను, కార్డ్ బోర్డ్ ముక్కలను, ప్లాస్టిక్ ముక్కలను తీసివేయాలి. చివరిగా, కాయ్ ఆ షర్టును వేసికోవాలి. ఆ బహుమానాన్ని తాను వినియోగించుకొనక ముందు తాను చేయవలసిన పదమూడు వేరైన పనులను కాయ్ లెక్కించాడు. "అమ్మా యిది ఎంత మాత్రమును బహుమానం కాదు ఎందుకంటే, దీన్ని నేను ఉపయోగించక ముందు పదమూడు భిన్నమైన కార్యాలు చేయవలసి వచ్చింది అని నేను మా అమ్మతో అనవచ్చునా?" అని అతడు అడిగాడు. "లేదు!" అది "యింకా బహుమానమే ఆ బహుమానాన్ని ఉపయోగించుకొనడానికి అవసరమైన పనులను మాత్రమే చేశాను" అని అతడన్నాడు. అదేవిధంగా, దేవుడు చేయవలెనని ఆజ్ఞాపించిన యావత్తును నేను, నీవు చేసిన మీదట, రక్షణ యింకను బహుమానంగానే ఉంటుంది. మనం చేసేదంతా పొంది, అంగీకరించి, దేవుని అద్భుతమైన బహుమానాన్ని ఉపయోగించుకొనడమే.

అన్నిటికంటె అతి శ్రేష్ఠమైన బహుమానాన్ని అంగీకరించడం ఎలా? అది ఎలాగో నీవు, నేను సూచింప సమర్థులం కాదు; ప్రభువు మాత్రమే ఈ విషయాన్ని మనకు తెలుపగలడు. దేవుని తలంపులు మన తలంపులవంటివి కావు (యెషయా 55:8, 9) "ఎలాగు?" అనే మన ప్రశ్నకు ప్రభువు తానే మనకు జవాబు దయచేశాడు.

అపొ. 2లో ప్రభువైన యేసును గూర్చి పేతురు ప్రసంగించాడు. అతడు యిలా అన్నాడు: "మీరు సిలువవేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను" (అపొ. 2:36). తన వాక్యమును విన్నవారు హృదయములో నొచ్చుకొని, "మేమేమి చేతుమని" వారు అడిగారు (37 వ.). "పేతురు – మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" అని చెప్పాడు (38 వ.). మరల, అపొ. 22లో, "గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుమని" మారుమనస్సు పొందిన ఒక విశ్వాసి చెప్పబడ్డాడు (16 వ.).

రక్షింపబడడానికి గాను, యేసునందు విశ్వాసముంచాలి, మన పాపముల విషయమై మారుమనస్సు పొందాలి, బాప్తిస్మం (నీటియందు ముంచడం) పొందాలి. కొన్ని షరత్తులను నెరవేర్చాలని మాత్రమే నేను చెప్పడం లేదు. నేను మాట్లాడుతున్నది తన్ను తాను సమర్పించుకోమని; నేను మాట్లాడుతున్నది జీవితాన్ని సమర్పించుకోమని.

సమర్పణను దేవుడు కోరుతున్నాడు. ఒక పేద విధవరాలి యొక్క కానుకను ప్రభువు మెచ్చుకున్నాడు: "వారందరు తమకు కలిగిన సమృద్ధిలోనుండి వేసిరి గాని, యీమె తన లేమిలో తనకు కలిగినదంతయు అనగా తన జీవనమంతయు వేసెనని చెప్పెను" (మార్కు 12:44). మాసిదోనియ వారికి కూడా ఆలాటి సమర్పణయే ఉంది. వారిని గూర్చి పౌలు

యిలా వ్రాశాడు: "మొదట ప్రభువునకును … తమ్మును తామే అప్పగించుకొనిరి" (2 కొరింథీ. 8:5).

ప్రభువునకు నిన్ను నీవు అప్పగించుకో, నీ జీవితంలో ప్రాధాన్యతలు తమంతట తామే క్రమంగా నిలిచియుంటాయి. నీ కాలంతోను, నీ డబ్బుతోను, నీ బలంతోను, నీ తలాంతులతోను ఏమి చేయాలో నీకు తెలిసియుంటుంది.

## ముగింపు

ప్రభువైన యేసు తన శిష్యులతో యిలా అన్నాడు: "ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" (మత్తయి 10:8బి). అన్నిటిలో అతి శ్రేష్ఠమైన ఈవిని దేవుడు ఉచితముగా నీకిచ్చాడు. నీ జీవితాన్ని ఉచితంగా ఆయనకిమ్మని ప్రార్థిస్తున్నాను.

సూచనలు

[1]ఈ పేరాగ్రాప్‌లోని మూడు ఉదాహరణలు జో. ఆర్. బెర్నెట్ వ్రాసిన "అతి శ్రేష్ఠమైన ఈవి" అనే కర పత్రికనుండి తీయబడిది (Lubbock, Tex.: Pathway Publishing House, 1979). [2]Quoted in Joe R. Barnett, " The Ultimate Gift," *Upreach* (Nov./Dec. 1982): 21. [3]Ibid., 20. The information on the five types of wounds is taken from Joe Barnett. [4]Ibid., 13, 20.